# యుద్ధాలకి బదులు....

కొడవటిగంటి

ఏదో, దేవుడి పెళ్లికంతా పెద్దలే గనక, భావి ప్రపంచశాంతిని గురించి అనేక చిన్న పెద్దలు రకరకాల సూచనలు చేస్తూన్న యీ సమయంలో, మా వూరి బుడ్డకాలవ గట్టుకింద ఓనాటి తెల్లారు ఝామున సమావేశమై మా వూరి పెద్దలైన ఉమ్మయ్యా, జగ్గయ్యా, తిమ్మయ్యా, పురుషోత్తం మొదలైనవారు చేసి నాకు అందించిన తీర్మానాలివి:

(ఈ తీర్మానాలను మొదట్లో నిర్దాక్షిణ్యంగా సెన్సారు చేసిపారేశాను గాని, రోజు రోజూ సముద్రాలు దాటి మనదేశంలో వచ్చి పడుతున్న అనేక సూచనలు పత్రికల్లో చదువుతున్నకొద్దీ మా బుడ్డకాలవ తీర్మానం నేననుకున్నంత పిచ్చిగా లేదేమో అనే సందేహం కలిగి దాన్ని ఇప్పుడు ప్రకటనకు విడుదలచేస్తూన్నాను.)

(1) యుద్ధాలు చాలా అసహ్యాకరమైనవి. వాటివల్ల ఏ ప్రయోజనమూ లేదు. ఎందుకంటే యుద్ధంలో ఇన్నికోట్లమందీ చచ్చిన తరవాత అసలు యుద్ధ ముద్దాయీలను మళ్ళీ వెతికి పట్టుకుని వేరే పని పెట్టుకుని ఉరి తియ్యాలి. ఇంతా అయిన తరవాత యుద్ధరుణాలు మూలవ్యాధిలాగా (మాపురుషోత్తం సూచన) పట్టుకుని ఓడిపోయిన దేశాల్లో బతికున్న వాళ్ళను తరతరాలా పీడించి, వాళ్ళు మళ్ళీ యుద్ధానికి తయారయేదాకా వదలవు. ఇది సంవత్సరాల కొద్ది ఆపరేషను (జగ్గయ్య).

ఇంక గెలిచిన దేశాల్లో చచ్చినవాళ్లు చావగా మిగిలినవాళ్లు చంకలు గుద్దుకోవటం సొంతం కాక మునుపే గెలిచిన దేశం తాలూకు డబ్బంతా రాబోయే యుద్ధానికి తయారవుతున్న దేశాలకు ఎగుమతి కావటం మొదలు పెడుతుంది. అంతటితో ఆర్థిక సమస్యలు పెరిగి, నిరుద్యోగం ప్రబలి, వచ్చే యుద్ధంలో చావవలసిన జనాభా కాస్తా సిద్ధమవుతుంది.

(2) యుద్ధాలింతటితో ఖచ్చితంగా అయిపోవాలి.

"బాగానే ఉంది గాని, మనుష్యప్రకృతి మనం ఎరుగుదుముకదా; ఇటువంటి మనుషులు యుద్ధాలు లేకుండా సుఖంగా ఉండగలరా?" అనేది ప్రశ్న.

అవును, దుర్మార్గులుంటారు. కొందరికి మట్టు అంటించకపోతే విరేచనం కానట్టు (ఉమ్మయ్య) యుద్ధాలు మానేస్తే కొందరికి నిద్రాహారాలుండవు. అయితే ఇటువంటివాళ్ళ కష్టసుఖాలు గమనించి ఈకింది సూచన చెయ్యటమయింది. (చూ. పేరా 3)

(3) ముందుముందు జరగబోయే యుద్ధాలలో— మనం వాటిని జరగనిస్తే మాటే అనుకోండి— దాదాపు అన్ని దేశాలూ పాల్గొంటే. ప్రతిఒక్క దేశంలోనూ, యుద్ధంలో అది ఓడిపోయే పక్షంలో, యుద్ధ కారకులు లేక యుద్ధముద్దాయీలకింద పట్టుబడే పెద్దలు కొందరుంటారు. (అదృష్టం బాగుండి ఆ దేశం గెలిస్తే వాళ్లే జడ్జీలుగా కూచుని యుద్ధ ముద్దాయీలమీద తీర్పు చెబుతారు. అందులో తప్పేమీ లేదు. న్యాయం ఏ పక్షాన ఉన్నదీ గెలుపుద్వారా తప్ప రుజువు కాదు. ఈ సంగతి కావలిస్తే భగవద్గీతలో కూడా చెప్పబడిఉందని నేను రుజువు చెయ్యగలను. అది అట్లా ఉంచండి.)

కాలం కలిసిరాకపోతే యుద్ధ ముద్దాయీలకింద జమ అయే పెద్దలెవరెవరైతే ఉన్నారో వాళ్లూ ఏటా ఇతర దేశాల్లో ఉన్న యుద్ధ ముద్దాయీల జాబితాలు— అంటే, రాబోయే యుద్ధానికి పురోగాములు కాదగినవాళ్ళ జాబితాలు — తయారు చేయడమూ, వాళ్లని రహస్యంగా హత్య చేయించటమూ జరిగితే యుద్ధాలు రావు.

(4) దీనివల్ల యుద్ధాలంతం కావటమే కాక ఇతర లాభాలు చాలా ఉన్నవనికూడా జగ్గయ్యాదులు కనిపెట్టారు.

(1) యుద్ధంలో చచ్చే ప్రతి ఒక్క మనిషికీ అయే ఖర్చు రానురాను చాలా జాస్తి అవుతున్నట్టు రూఢి దాఖలా ఉంది. ఈ యుద్ధంలో పుర్రెకు షుమారు రెండు లక్షల రూపాయ లయినట్టు విన్నాను. కాని ఇది ఇన్ఫ్లేషను రాక పూర్వమని

నా నమ్మకం. ఇటీవల పుర్రెల ఖరీదు ఇంకా పెరిగి ఉండాలి. (ఈ ఖర్చు భారతీయ పుర్రెలకు వర్తించదు. భారతీయులు అతిచౌకగా, చాలా లాభాన కూడా చచ్చినట్టు భావించవలసి ఉంది.)

అవునా? అటువంటప్పుడు కొద్దిమంది యుద్ధ ముద్దాయీలని చంపటానికి ఇంత ఖర్చుండదు. పుర్రెకు ఏ పదివేలో ఇచ్చుకుంటే సరిపోవచ్చు.

మరో విశేషం ఏమిటంటే: యుద్ధంలేనిపక్షంలో యుద్ధముద్దాయీల జాబితా లింత పొడుగూ ఉండవు. ఇప్పటికి జాబితాలలో కాలానికి కట్టుపడి మానాభిమానాలు విసర్జించిన అప్రయోజకులు- మన అందరిలాటివాళ్లే — కొందరున్నారు. యుద్ధాలను పైన చెప్పినసూచనప్రకారం అరికట్టే పక్షంలో ఇంతమంది ముద్దాయీ లుండరు.

ప.రా: ఈ జాబితాలు అసమగ్రంగాఉండి,అందులో కేవలమూ ఏమరుపాటునమాత్రమే కొందరు ముద్దాయీల పేర్లు చేర్చకపోవటం జరుగుతే జరగవచ్చు. (పురుషోత్తం ప్రకటించిన భయం.) కాని అదంత ఎక్కువ చెయ్యవలసిన ప్రమాదం కాదు. అటువంటివి యుద్ధ యుగంలోకూడా జరగటం కద్దు. కనక దాన్ని పాటించవలసిన పని లేదు.

అంతా బాగానే ఉంది కాని ఈ హత్యలు చెయ్యటానికి ఒడిగట్టేదెవరనేది గడ్డు ప్రశ్న.

నలుగురితోపాటు నారాయణా అని సైనికులుగా చేరి కొద్దిజీతం మీదనైనా సరే, శత్రువును చంపి రమ్మంటేనూ, ఆడవాళ్లమీదా పిల్లలమీదా అగ్నివర్షం కురిపించి రమ్మన్నా, పొయ్యేవాళ్ళుంటారుగాని, "దేశంకోసం, స్వాతంత్ర్యంకోసం, యుద్ధాలు ఆపుదలకోసం, సత్యంకోసం, ధర్మంకోసం, పెట్టుబడిదారీకోసం ఫలాని దేశంలోవున్న యుద్ధముద్దాయీని చంపిరా. రానూ పోనూ, మూడు ఫస్టుక్లాసులూ, భత్తాలూ ఇచ్చి ఓ పదివేలిచ్చుకుంటాం. నీ ఋణం ఉంచుకోంలే !" అంటే వినేవాళ్ళు దొరక్కపోవచ్చు. కార్యం సానుకూలం చేసుకొచ్చిన వాళ్లకి ఏక్లాసులో తగలేస్తే కొంత ప్రోత్సాహకరమైన ఫలితాలు కనిపించవచ్చు. కాని ఈ సమస్య పరిష్కారం కావటానికి దివ్యమైన ఉపాయం వేరే వుంది.

అదేమిటంటే, హత్య చెయ్యటం వృత్తిగాగల వాళ్ళని దీనికి నియమించటం.

ప్రతి దేశంలోనూ అనేక వందలమంది హంతకులున్నారు. వాళ్ళని నిష్కారణంగా, న్యాయం పేరిట ఉరితీసి తీరా లక్షల సంఖ్యలో హంతకులు కావలసివచ్చేసరికి నానా అగచాట్లూ పడి, జన సామాన్యాన్ని పట్టుకొచ్చి ఇసుక బస్తాలమీద వాళ్లకి అభ్యాసం ఇచ్చి క్షోభపడుతున్నాం.

కాని ఈ హంతకులనే మనం సద్వినియోగపరిస్తే వీళ్ళు మన యుద్ధ సమస్య పరిష్కరించటమే గాక కాలక్రమాన దేశకల్యాణం చేకూర్చి మనకు సామ్రాజ్యాలుకూడా నెత్తురుచుక్క— యుద్ధముద్దాయీల దుష్ట రక్తం తప్ప—రాలకుండా సంపాదించి పెడతారు.

◆ ◆ ◆

పైన చేసిన సూచనల్లో ఏదన్నా సందుగాని, పొరగాని, లోటుగాని తభావతుగాని ఏమైనా ఉందా అని చాలా యోచించాను. కాని, నాకేమీ కనిపించటం లేదు సరేకదా కొందరు కొందరు చేస్తున్న ఇతర సూచనలకన్న ఇవే చాలాబాగున్నవని కనిపిస్తున్నది. అయినా వీటిని గురించి జాగ్రత్తగా పరిశీలన చేసి వాటిలో గల మంచి చెడ్డలు నిర్ణయించే బాధ్యత ప్రపంచానికి వదిలేస్తున్నాను.

ఉమ్మయ్యా, జగ్గయ్యా, తిమ్మయ్యా, పురుషోత్తమూ మావూరివాళ్ళు. రాబోయే శాంతి సమావేశంలో ఈసూచనలకు ప్రాధాన్యం ఇవ్వబడి మావాళ్ళు పైకొస్తే నాకదే పదివేలు!

ఏకారణం చేతనైనా స్త్రీలు చాలాకాలం బహిష్టు కానియెడల అటువంటివారు **24** గంటలలోగా అట్టి బాధనుండి విముక్తి చెందుటకు **"చుంబికి రేచని"** వాడుడు. కాంట్రాక్టు అంగీకరింపబడును. తప్పక పనిచేయును. గవర్నమెంటు రిజిష్టర్డు. గ్యారంటీ నేయుదురు. రూ. **2-12-0.** **"దంపతి సఖ"** మీరు కోరినట్లుగా సంతాన నిరోధం చేయవచ్చును. సునిశితంగా పనిచేయును, ప్రమాదంలేదు. శాశ్వతమైనది రూ. **4-4-0.** తాత్కాలికం రూ. **1-8-0.** వి. పి. **12** అణాలు అదనం.

**విగర్ "మదన్ విలాస్ రసాయనం"** ధాతుక్షీణత, నపుంసకత్వం, స్వప్నస్ఖలనం, నరాల బలహీనత మొదలైనవాటికి. 7 రోజులువాడిన చాలును. వైవాహిక జీవనాన్ని అనుభవించండి. రూ. 2-8-0.

**KAVIRAJ M. KABYATIRTHA,**
70, (A.V.) Cornwalis Street, CALCUTTA
**Stockists:— MILTON & MILLER**
**157, Broadway :: MADRAS**